ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
గురువారం 3 అక్టోబరు 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 34.0 కనిష్ఠం: 26.0




విద్యుత్ వెలుగుల్లో ధగధగలాడుతున్న అమ్మవారి ఆలయం

విద్యుత్ కాంతుల్లో జోగులాంబ ఆలయం

- నేటి నుంచి దసరా ఉత్సవాలు

అలంపూరు, అక్టోబరు 2: జోగులాంబ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 12 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పురేందర్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి స్వామివారి ఆనతి స్వీకరణ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్ వరణము, మహా కలశ స్థాపన, అగ్నిముఖం నిర్వహించనున్నారు. సాయంత్రం అమ్మవారి దర్బారు సేవలో తరించనున్నారు. శైలపుత్రీ దేవి అలంకరణలో కనిపించనున్నారు.



బతుకమ్మలతో మహిళలు

ఎంగిలి పూల బతుకమ్మ

పూల పండుగ ప్రారంభమైంది. ఇక ఊరూవాడా మహిళలు బతుకమ్మలతో సందడి చేయనున్నారు. మొదటి రోజు బుధవారం ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. మహబూబ్‌నగర్‌లోని భగీరథ కాలనీలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలమూరు పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్‌పై ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మ ఆడిన తరువాత ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేయనున్నారు. మరోవైపు దసరా పండుగ నేపథ్యంలో గురువారం నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

- మహబూబ్‌నగర్

ఉబుకుతున్న సమస్య

- శ్రీరంగాపురం ఊర్లోకి రంగ సముద్రం రిజర్వాయర్ నీరు
- తడుస్తున్న ఇళ్ల గోడలు
- ఊర్లో ఎక్కడ తవ్వినా ఉబికి వస్తున్న నీరు
- ఊరికి దగ్గరగా రిజర్వాయర్, ఊరికంటే ఎత్తులో నీళ్లు ఉండటమే కారణం
- ఆందోళనలో గ్రామస్థులు
- పునరావాసం కల్పించాలని గతంలో అధికారుల నివేదికలు



నీటి ఊట వల్ల తడిసిన ఇంటి గోడను చూపుతున్న శ్రీరంగాపురం గ్రామస్థుడు



శ్రీరంగాపురం గ్రామం


శ్రీరంగాపురం, అక్టోబరు 2: భీమా ప్రాజెక్టులో అంతర్భాగమైన రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వల్ల శ్రీరంగాపురం గ్రామానికి నీటి ఊట సమస్య ఏర్పడటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఏటా వర్షా కాలంలో గ్రామంలో నీటి ఊట వస్తోందని, ఇళ్లలోకి నీరు చేరుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామానికి పునరావాసం కల్పించాలని గతంలో అధికారులు నివేదికలు ఇచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు.

జలయజ్ఞంలో భాగంగా నిర్మాణం

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం పథకంలో భాగంగా 2005లో రూ.42 కోట్లతో రంగ సముద్రం రిజర్వాయర్ పనులను ప్రారంభించారు. 2010లో పనులు పూర్తయ్యాయి. అయితే రంగ సముద్రం పాత చెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.40 టీఎంసీలు కాగా, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాక, సామర్థ్యాన్ని 1.85 టీఎంసీలకు పెంచారు. ఆ సందర్భంగా అధికారులు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో కాకుండా సగం వరకే నిల్వ చేశారు. తర్వాత దశల వారీగా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకుంటూ వచ్చారు. పాత చెరువు ఎఫ్‌టీఎల్ ఎత్తు 319.125 మీటర్లు ఉండగా, రిజర్వాయర్‌గా మార్చాక ఎఫ్‌టీఎల్ ఎత్తు 325.500లకు పెంచారు. గ్రామం కన్నా రంగ సముద్రం నీటి ఎత్తు 6.40 మీటర్ల ఎక్కువ ఉండటంతో సమస్య మొదలైంది. ఒత్తిడి పెరిగి, ఊట పెరుగుతోంది. గ్రామంలోని భూమి, నీటిని పీల్చుకుని, తిరిగి వదిలేసే రకం కావడంతో సమస్య జఠిలంగా మారింది.

నిబంధనలకు విరుద్ధంగా రిజర్వాయర్ నిర్మాణం

నిబంధల ప్రకారం రిజర్వాయర్‌ను గ్రామానికి 100 మీటర్ల దూరంలో నిర్మించాల్సి ఉండగా, కేవలం 55 మీటర్ల దూరంలో మాత్రమే ఉండటంతో గ్రామంలో ఎక్కడ అడుగు లోతు తవ్వినా నీరు ఊరుతోంది. ఈ రిజర్వాయర్‌ను 2017లో ప్రభుత్వానికి అప్పగించారు. 2017 డిసెంబరు ఆరున ఆ నాటి కలెక్టర్ వి.ఉషారాణి ఊట సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర నీటిపారుదల కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ మెమో 610 జారీ చేశారు. దీంతో డైరెక్టర్ గ్రౌండ్ వాటర్, జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఆర్‌అండ్ఆర్ బృందంగా ఏర్పాటు చేసి, కమిటీని వేశారు. దీంతో అప్పటి రాష్ట్ర చీఫ్ ఇంజనీర్లు ప్రకాష్, మోహన్ రెడ్డి శ్రీరంగాపురానికి ఎప్పటికైనా ఊట సమస్య ఉంటుందని ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఉమ్మడి జిల్లాలో నేరేడు గ్రామం, భూత్పూర్, కానాయపల్లి మాదిరిగానే శ్రీరంగాపురం గామానికి కూడా పునరావాసం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందించారు. రాష్ట్ర భూగర్భ జల శాఖ డైరెక్టర్ మురళీకృష్ణ రిజర్వాయర్ వల్ల భవిష్యత్తులో ఊట ప్రమాదం ఉంటుందని తేల్చేశారు. మళ్లీ 2012 జూలై 28న జిల్లా ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి అధికారులు పర్యటన చేపట్టారు. అప్పటి కలెక్టర్ గిరిజా శంకర్ పునరావాసానికి సంబంధించి అన్ని శాఖల అధికారులతో శ్రీరంగాపురం వచ్చి, తెలుగు వీధిలో ఒక అడుగు గుంత తీయించారు. నీరు రావడంతో ప్రభుత్వానికి నీటి ఊట సమస్యను నివేదించారు. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం రాష్ట్ర పునరావాస కమిషనర్‌గా ఉన్న టీకే శ్రీదేవి జీవో 68 పరిధిలోకి వస్తుందా? లేదా? పరిశీలించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.



నీటి ఊట పీల్చుకుని వెళ్లేలా ఏర్పాటు చేసిన పైపులైన్ ఫెయిల్ కావడంతో దాని పైనుంచి వస్తున్న నీరు

అధిక వర్షాలతో..

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామానికి పునరావాసం కల్పించడానికి దాదాపు రూ.200 కోట్లు ఖర్చు అవుతుందనే ఉద్దేశంతో సమస్యను పక్కన పెట్టింది. అప్పటి నుంచి సమస్య నలుగుతూనే ఉంది. ఈ ఏడాది అధిక వర్షాలు రావడం వల్ల మళ్లీ ఊట సమస్య తెర మీదకి వచ్చింది. గ్రామంలోని పలు వీధులలో నీటి ఊట రావడం ఇళ్లలోకి నీరు చేరింది. దాంతో బాధితులు ఆందోళనకు దిగారు.

కోటి 20 లక్షలు నీటి పాలు

గ్రామంలో నీటి ఊట సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం రూ.కోటీ 20 లక్షలతో పైపులైన్ నిర్మాణం చేపట్టింది. నీటి ఊటను ఆ పైపులు పీల్చుకుని, పైపులైన్ ద్వారా రిజర్వాయర్ అలుగుకు కలిపారు. కానీ పైపులు నీళ్లు పీల్చుకోకపోవడంతో పైపులైన్ పైనుంచి పారుతున్నాయి. దాంతో సమస్య పరిష్కారం కాలేదు.



గ్రామంలోకి చేరిన నీరు

పునరావాసం కల్పించాలి

నేను సర్పంచ్‌గా, జడ్పీటీసీ సభ్యుడిగా పదేళ్లు పని చేసినప్పుడు గత ప్రభుత్వం దృష్టికి నీటి ఊట సమస్యను తీసుకెళ్లాను. కానీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సమస్యను పక్కన పెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తా. గ్రామానికి పునరావాసం ఏర్పాటు చేయాల్సిందే.

- రాజేంద్ర ప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నాం

రంగ సముద్రం నిర్మాణం నాటి నుంచి నీటి ఊట వస్తూనే ఉంది. ఏటా వర్షాకాలంలో మాకు ఈ కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రభుత్వమైనా స్పందించి, మా ఇళ్లను పరిశీలించి పునరావాసం కల్పించాలి.

- చీర్ల విజయ భాస్కర్, శ్రీరంగాపురం



మహబూబ్‌నగర్ పట్టణంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు



పాలమూరులోని మౌలాలి గుట్టపై ఏర్పాటు చేసిన జంతు జనన నియంత్రణ కేంద్రం

ఆ కుక్కలు.. ఎక్కడ?

- శునకాల సంతతిని తగ్గించేందుకు జనన నియంత్రణ ప్లానింగ్
- ఏబీసీ సంస్థకు పాలమూరు పురపాలిక బాధ్యత అప్పగింత
- గుర్తుగా చెవుల కత్తిరింపు
- ఇప్పటి వరకు 5,600 కుక్కలకు ఆపరేషన్ చేశామంటున్న సంస్థ
- కనిపించని ఆ కుక్కలు



మహబూబ్‌నగర్, అక్టోబరు 2: మహబూబ్‌నగర్ పురపాలికలో జనన నియంత్రణ చేసిన శునకాల సంఖ్య విషయంలో గందరగోళం నెలకొంది. ఇప్పటి వరకు 5,600 కుక్కలకు ఆపరేషన్లు చేశామని ఏబీసీ(ఆనిమల్ బర్త్ కంట్రోల్ సంస్థ) చెబుతుండగా, పట్టణంలో అవి కనిపించకపోవడం గమనార్హం. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు మనుషులు, ముఖ్యంగా చిన్నపిల్లలపై దాడి చేసి, గాయపరుస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట మరణాలు కూడా సంభవిస్తున్నాయి. దాంతో కుక్కలను నిర్మూలించాలన్న డిమాండ్ పెరుగుతోంది. అయితే వాటిని మట్టుపెట్టడం కంటే సంతతిని తగ్గించాలని జంతు జనన నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్లానింగ్ చేస్తున్నారు. ఆ బాధ్యతను ఏబీసీ సంస్థకు అప్పగించారు. ఆ కేంద్రాన్ని ముందుగా పాలమూరు పురపాలికలో ఏర్పాటు చేయగా, క్రమంగా అన్ని పురపాలికలకు విస్తరిస్తున్నారు. పాలమూరు పురపాలికలో ఇప్పటివరకు 5,600 శునకాలకు ఆపరేషన్ చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒక్కో శునకం ప్లానింగ్ కోసం రూ.1,400 మునిసిపాలిటీ ఆ సంస్థకు వెచ్చిస్తోంది. పాలమూరులోని మౌలాలి గుట్టపై జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రోజూ 10 కుక్కలకు ప్లానింగ్ చేస్తున్నారు. ప్లానింగ్ చేసిన తరువాత వాటిని గుర్తించేందుకు, ఒక చెవిని 'వి' ఆకారంలో కట్ చేస్తారు. చెవి కట్ చేసిన శునకాన్ని మళ్లీ ప్లానింగ్ కోసం తరలించకుండా ఉండేందుకు అలా చేస్తారు.

పట్టిన కుక్కలనే మళ్లీ పడుతున్నారు

పురపాలిక పరిధిలో 14 వేల శునకాలు ఉన్నాయని, అందులో ఇంకా తొమ్మిది వేల వరకు ప్లానింగ్ కాకుండా మిగిలిపోయి ఉన్నాయని ఏబీసీ నిర్వాహకులు చెబుతున్నట్లు పుర అధికారులు అంటున్నారు. కానీ సర్వే చేసిన అధికారులు మాత్రం 8,500 వరకు మాత్రమే కుక్కలు ఉన్నాయని అంటున్నారు. ఈ అంకెల గందరగోళం నేపథ్యంలో ప్లానింగ్ చేసిన శునకాల వివరాల లెక్కలు తీయాల్సిన అవసరం ఉంది. వార్డులలో మాత్రం పట్టిన కుక్కలనే మళ్లీ మళ్లీ పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిపించని చెవులు కత్తిరించిన కుక్కలు

పాలమూరు పురపాలిక పరిధిలోని వార్డులలో ఎన్ని కుక్కలు ఉన్నాయో మునిసిపల్ సిబ్బంది సర్వే చేశారు. ఆ సర్వే ప్రకారం ఒక్కో వార్డులో 120 నుంచి 130 ఉన్నట్లు తేలింది. సర్వే చేస్తున్న సమయంలో కనిపించని కుక్కలు ఏవైనా ఉంటే 170-180 వరకు ఉండొచ్చని, ఈ లెక్కన 49 వార్డులలో 8,500లకు మించకుండా ఉంటాయని పుర అధికారులు అంచనాకు వచ్చారు. ఇప్పటి వరకు 5,600 శునకాలకు ప్లానింగ్ చేసి, చెవులు కత్తిరించినట్లు అధికారులు చెబుతున్నారు. అలా అయితే.. వార్డులలో ఉంటున్న కుక్కలలో మూడో వంతు వాటికి ప్లానింగ్ అయిపోయి ఉండాలి. కానీ చెవులు కత్తిరించిన కుక్కలు ఎక్కడా కనిపించడం లేదు. అధికారులు చెబుతున్న ప్రకారం ప్రతీ మూడింటిలో రెండు కుక్కల చెవులు కత్తిరించి ఉండాలి. క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. 100 కుక్కలను పరిశీలిస్తే అందులో పది కూడా చెవులు కత్తిరించినవి లేవంటే వాస్తవ పరిస్థితి ఏంటో తెలుస్తోంది. దీనిని బట్టి చూస్తే ఏబీసీ ఇస్తున్న గణాంకాల మేర ప్లానింగ్ జరుగలేదా?.. లేదంటే ప్లానింగ్ చేసినా చెవులు కత్తిరించడం లేదా? అన్నది అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. ఒక్కో కుక్క ప్లానింగ్ కోసం పురపాలిక రూ.1,400 చెల్లిస్తోంది. ఈ లెక్కన ఇప్పటివరకు చేసిన ప్లానింగ్‌కు రూ.80 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది.




ప్లానింగ్ తరువాత కట్ చేసిన కుక్కల చెవులు

వి ఆకారంలో కట్ చేస్తున్నాం

ప్లానింగ్ చేసిన శునకాలను గుర్తించేందుకు జంతు జనన నియంత్రణ కేంద్రంలో వి ఆకారంలో ఒక చెవిని కట్ చేస్తున్నాం. పట్టిన కుక్కలను మళ్లీ మళ్లీ పట్టడానికి వీలుండదు. ఒకవేళ చెవి కత్తిరించిన కుక్కను పట్టినా అక్కడే వదిలేస్తాం. ప్లానింగ్ కోసం ఎక్కడి నుంచి పట్టుకొని వెళ్లామో.. సర్జరీ చేసిన తరువాత తిరిగి అదే ప్రాంతంలో వాటిని వదిలేస్తాం.

- కౌశిక్, ఏబీసీ నిర్వాహకులు

5,600 శునకాలకు ఆపరేషన్

పురపాలిక పరిధిలో ఇప్పటి వరకు 5,600 శునకాలకు ప్లానింగ్ చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో చెవులు కత్తిరించిన కుక్కలు కనిపించడం లేదంటే మరోసారి పరిశీలిస్తాం. వాళ్లు చెబుతున్న లెక్కల ప్రకారం అయితే పట్టణంలో 14 వేల వరకు ఉన్నాయని అంటున్నారు. మధ్యలో ఎనిమిది నెలలు ప్లానింగ్ నిలిపేశాం. ఆ సమయంలో సంతతి కూడా పెరిగి ఉండొచ్చు. ఇలా అన్నింటినీ పరిశీలిస్తాం.

- రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- మొదటి రోజు 114 మంది అభ్యర్థులు హాజరు
- పర్యవేక్షించిన డీఈవో రవీందర్
- 243 పోస్టులకు 1:3 పద్ధతిన ఎంపిక



ధ్రువపత్రాల పరిశీలనను పర్యవేక్షిస్తున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 2: డీఎస్సీ-2024 రాత పరీక్ష ఫలితాలల్లో 1:3కి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రల పరిశీలన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. అందుకోసం జిల్లా విద్యాశాఖ 12 కమిటీలను ఏర్పాటు చేసింది. 1:3కి సంబంధించి ఎస్‌జీటీ ఎంపిక జాబితా ప్రకారం అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నారు. జిల్లాలో 243 పోస్టులకు గాను అభ్యర్థులను ఎంపిక చేశారు. మొదట సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్యాంపులో ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ ప్రక్రియ సాగింది. డీఈవో రవీందర్ దగ్గరుండి పర్యవేక్షించారు. మొదటి రోజు పరిశీలనకు 114 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో తెలిపారు. ఈ నెల ఐదో తేదీ వరకు కార్యక్రమం కొనసాగనుంది.

అప్పులు తీర్చలేక.. యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల, అక్టోబరు 2: అప్పులు తీర్చలేక చెట్టుకు ఉరి వేసుకుని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లికి చెందిన మిద్దె గణేష్(18) ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణేష్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. నెల రోజులుగా అప్పులు చేస్తున్నాడన్న విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో మందలించారు. డబ్బులు తీసుకొస్తానని మంగళవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. బుధవారం ఉదయం పోలేపల్లి శివారులోని ఓ వ్యవసాయ పొలంలో గల చెట్టుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గణేష్ సోదరి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'నేను నక్సలైట్‌ను రూ.50లక్షలు ఇవ్వండి'

ఖిల్లాఘణపురం, అక్టోబరు 2 : తాను నక్సలైట్‌నని డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తానని ఓ వ్యక్తి ఫోన్ చేసిన బెదిరింపులకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఖిల్లాఘణపురం మండలం సోలిపూర్‌కి చెందిన వనపర్తి జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీనేటి శేఖర్‌రెడ్డికి బుధవారం ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతున్నానని చెప్పారు. రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులందరూ కలిసి రూ.50లక్షల ఇవ్వాలని, పోలీసులకు సమాచారం ఇస్తే కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించాడు. కాగా శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు.

నవోదయలో 9, 11 తరగతుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

బిజినేపల్లి, అక్టోబరు 2 : ఉమ్మడి జిల్లాలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలు పొందేందుకు ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు చెందిన 8, 10వ తరగతులు ఏదేని ప్రభుత్వ, గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు 2010, మే ఒకటి నుంచి 2012, జూలై 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. అలాగే 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసే అభ్యర్థులు 2008, జూన్ ఒకటి నుంచి 2010, జూలై 31 లోపు జన్మించి ఉండాలని పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో అర్హులైన విద్యార్థులు ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష 2025, ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కృష్ణానదిపై వంతెన ఏర్పాటు చేయాలి



మంత్రికి తేనె సీసాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్, అక్టోబరు 2 : పదర మండలంలోని మద్దిమడుగు సమీపంలో గల కృష్ణానదిపై వంతెన ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం మల్లికార్జున దర్శనానంతరం బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో మన్ననూరులోని అటవీ శాఖ అతిథి గృహం వద్ద ఆగిన ఆయనను ఎమ్మెల్యే, మండల కాంగ్రెస్ శ్రేణులు కలిశారు. మద్దిమడుగు ఆంజనేయ స్వామి పుణ్యక్షేత్రం సమీపంలోనే గల కృష్ణానదిపై వంతెన ఏర్పాటు చేస్తే ఆంధ్రప్రదేశ్ నుంచి అమ్రాబాద్, పదర మండలాల నుంచి అంతర్రాష్ట్ర రహదారి ఏర్పాటవుతుందని, దీంతో నల్లమల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ విషయమై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సైతం కలిసి విన్నపించానని, మన సీఎం రేవంత్‌రెడ్డికి సైతం కృష్ణానదిపై వంతెన ఏర్పాటుకు కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సందర్భంగా నల్లమలలో లభించే తేనె సీసాలను అందజేశారు. కార్యక్రమంలో హరినారాయణ, రహీం, దాసరి శ్రీనివాసులు, తుల్యా, వెంకటేశ్వర్లు, జాకీర్‌షరీఫ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో జూనియర్ కళాశాల

- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రభుత్వం



శిథిలావస్థకు చేరిన తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 2 : జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనం పెచ్చులు ఊడిపడి, గోడలకు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే గోడలు తడిసి పోయి మరింత దెబ్బతింటున్నాయి. కళాశాలలో మొత్తం 31 గదులు ఉండగా వాటిలో కొన్నింటికి పైకప్పు పెచ్చులూడిపడగా, మరికొన్నింటికి ఆర్‌సీసీ రేకులకు పగిలిపోయి రంధ్రాలు పడ్డాయి. భారీ వర్షం వస్తే తరగతి గదిలో నీళ్లు నిలిచి కాలు పెట్టేందుకు చోటు లేకుండా మారుతోంది. తరగతి గదులతో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపకుల గది అన్నింటిలో ఇదే పరిస్థితి. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియక అధ్యాపకులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భయంతో గడుపుతున్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కళాశాల గోడలు బాగా తడిసిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

హామీలకే పరిమితం

1967లో నిర్మించిన ఈ భవనంలో కొన్నాళ్ల పాటు ప్రభుత్వ పాఠశాలగా కొనసాగి, 1971-72 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రారంభమైంది. అప్పటి నుంచి నేటి వరకు ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దిన ఈ కళాశాల నేడు శిథిలావస్థకు చేరు కోవడంతో పాటు సౌకర్యాల లేమితో ఆదరణకు నోచుకోవడం లేదు. కళాశాలలో ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తుండగా 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాల భవనం శిథిలావస్థకు చేరడంతో నిర్వహిస్తున్న కోర్సులు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. కళాశాలను కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్నో సార్లు సందర్శించి నిర్మిస్తామని హామీ ఇస్తున్నారే తప్పా ఫలితం మాత్రం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి కళాశాలకు నూతన భవనం నిర్మించి ఆధునిక వసతులు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కళాశాల భవనం

ప్రతిపాదనలు పంపించాం..



కళాశాలకు కొత్త భవనం నిర్మించాలని కోరుతూ నోడల్ అధికారి సహాయంతో రాష్ట్ర కమిషనర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులకు ప్రతిపాదనలు పంపించాం. అంతేకాకుండా కళాశాలకు సహాయం చేయాలని ఎన్ఆర్ఐ దాతలను కూడా కోరాం. ఇటీవల లే కళాశాలను సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే త్వరలో కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మాధవి, ప్రిన్సిపాల్

క్రీడల్లో ప్రతిభ చాటితే ఉద్యోగ అవకాశాలు

- డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్
- జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు



హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్

గద్వాల అర్బన్, అక్టోబరు 2 : విద్యార్థులు క్రీడలు ఆడటం వల్ల భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు డీవైఎస్‌వో ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలు ఆడటం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక వికాస అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న మాట్లాడుతూ అండర్ -14, 16, 18, 20 విభాగాల నుంచి జిల్లాలోని పలు మండలాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు 7, 8 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జితేందర్, కృష్ణయ్య, ఆంజనేయులు, అశోక్, భీమేష్, గణేష్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు షూటింగ్ బాల్ క్రీడాకారులు

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మంచి ఆటతీరు కనబరచి ప్రతిభ చాటాలని డీవైఎస్‌వో అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు బయలు దేరుతున్న బాలబాలికల జట్లకు అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు అండర్- 19 రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ పట్టణంలో జరుగు తాయన్నారు. గతంలో లాగానే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. అనంతరం బాలబాలికలకు ధరూరు మండలం చింతరేవుల చెందిన కావలి శ్రీనివాసులు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, మంజునాథ్, కోశాధికారి పరశురాములు పలువురు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలకు పలువురు విద్యార్థులకు ఎంపికయ్యారు. గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన లక్ష్మీప్రసన్న, అనిత, మండలంలోని అనంతపురం జెడ్పీహెచ్‌ఎస్ చెందిన ప్రేమ్‌కుమార్, ఎస్‌కే షరీన్, నందిని, వీణ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల గద్వాల ఎంఈవో శ్రీనివాసగౌడ్, హెచ్‌ఎం జహీరుద్దీన్, పీడీ కృష్ణయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్రవంతి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.



షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన బాలబాలికల జట్టు

సుదర్శన్‌రావు జీవితం ఆదర్శనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి
- సుదర్శన్‌రావు స్మారక సంచిక ఆవిష్కరణ



సుదర్శన్‌రావు స్మారక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 2 : స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత పెంటమరాజు సుదర్శన్‌రావు జీవితం ఆదర్శనీయమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, పరిశోధకుడు హెచ్.రమేష్‌బాబు సంపాదకత్వంలో స్వాతంత్ర్య సమరయోధుడు సుదర్శన్‌రావు 'మన గాంధీ' స్మారక సంచికను ఆవిష్కరించారు. గాంధేయవాది జీ.వీ.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై సంచికను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంటమరాజు సుదర్శన్‌రావు, స్వాతంత్ర్య సమరయోధుడిగా, జాతీయోన్నత పాఠశాల కార్యదర్శిగా, శ్రీపురం సర్పంచుగా, మార్కెట్ కమిటీ తొలి చైర్మన్‌గా, హరిజన సేవా అధ్యక్షుడిగా, కుల నిర్మూలన వాదిగా, సామాజిక సంఘ సంస్కర్తగా ఈ ప్రాంతానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయమకన్నారు. సుదర్శన్‌రావు స్మారక సంచికను అందరూ చదివి ఆయన అడుగు జాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హకీం మురళి, రాఘవాచారి, పి.అబ్దుల్లాఖాన్, చెన్నయ్య, జెట్టి ధర్మరాజు, వెంకేశ్వరం నిరంజన్, రాంచందర్‌రావు, గీత, భాస్కర్‌రావు, శరత్‌బాబు, పి.వహీద్‌ఖాన్, పార్థసారథి, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో రెండు పోస్టులకు టాప్ ర్యాంకు

- కొల్లాపూర్ యువతి ప్రతిభ



నర్లపల్లి స్వప్న

కొల్లపూర్, అక్టోబరు 2 : మొదటి ప్రయత్నంలోనే డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో రెండు ఉద్యోగాలు సాధించి ప్రతిభ చాటిన నర్లపల్లి స్వప్నను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చుక్కాయిపల్లికి చెందిన సుగుణమ్మ, కృష్ణయ్య దంపతులు తన కూతురికి ఉన్నత చదువు చదివించారు. చదువుకు ప్రతిఫలం దక్కేలా తన భర్త మల్లేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో ఆయన ప్రోత్సాహంతో ఇంటి వద్దే ఉండి ప్రణాళికతో చదివి మొదటి ప్రయత్నంలోనే తెలుగు పండిట్ విభాగంలో జిల్లా ప్రథమ స్థానం, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో ద్వితీయ స్థానం సాధించింది. ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో గ్రామస్థులు ఆమెను అభినందించారు. చుక్కాయిపల్లికి చెందిన నర్లపల్లి స్వప్న ప్రస్తుతం భర్త ఉద్యోగ రీత్యా వనపర్తి జిల్లా కేంద్రంలో స్థిరపడ్డారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తెలకపల్లి, అక్టోబరు 2 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ బుధవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని దుందుభి వాగు దాసర్లపల్లి నుంచి రాకొండ మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందని ఎస్ఐ తెలిపారు. వెంటనే వెళ్లి మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

'స్వచ్ఛభారత్ దివస్'కు హాజరైన అధికారులు



ఢిల్లీలో కల్వకుర్తి మునిసిపల్ అధికారులు

కల్వకుర్తిటౌన్, అక్టోబర్ 2 : స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభమై పదేళ్లు అయిన సందర్భంగా పురస్కారాలకు రాష్ట్రం నుంచి నాలుగు మునిసిపాలిటీలు ఎంపికయ్యాయి. అందులో కల్వకుర్తి మునిసిపల్ ఉందని, ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి కల్వకుర్తి నుంచి డీఎంఏ గౌతమ్, కమిషనర్ మహమ్మద్ షేక్, మహిళా సంఘం సభ్యురాలు స్వరాజ్యలక్ష్మి హాజరై పురస్కారం అందుకున్నట్లు వారు తెలిపారు. కల్వకుర్తి మునిసిపల్‌కు స్వచ్ఛభారత్ దివస్ పురస్కారం రావడం ఆనందదాయకమని చైర్మన్ ఎద్మసత్యం, కౌన్సిలర్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికురాలు మృతి

ధరూరు, అక్టోబరు 2 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు మాల శంకరమ్మ(50) బుధవారం గుండెపోటుతో మృతిచెందింది. ఈమె రోజువారి పనుల్లో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీకి వెళ్లింది. ఆ సమయంలో ఆమెకు గుండె నొప్పి రావడంతో స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు వెంటనే గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డు దాటుతుండగా.. వాహనం ఢీకొని యువకుడి మృతి

కొత్తకోట, అక్టోబరు 2 : జాతీయ రహదారి దాటుతున్న యువకుడిని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో నెలకొంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యరాత్రి మండలంలోని ముమ్మళపల్లి శివారు కడుకుంట్ల స్టేజి వద్ద రాములు (35) రోడ్డు దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారం లభించలేదు. మృత దేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి ఫొటోలను ప్రమాదానికి సమీపంలోని గ్రామాలైన ముమ్మళపల్లి, కడుకుంట్ల, విలియంకొండ తండా వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. కడుకుంట్ల వాసులు మృతి చెందిన వ్యక్తిని రాములుగా గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. పెబ్బేర్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పాడని, తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వాహనం దిగి రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి



శివశంకర్ యాదవ్ (ఫైల్)

పెబ్బేరు, అక్టోబరు 2 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని రంగాపురం శివారులో ఏబీడీ కంపెనీ సమీపంలో 44వ జాతీయ రహదారిని ద్విచక్రవాహనం దాటుతుండగా కారు ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వీపనగండ్ల మండలం కల్వరాల చెందిన పాపయ్య అలియాస్ శివశంకర్ యాదవ్ (35) ఏబీడీ కంపెనీలో లారీ నిలిపి ద్విచక్రవాహనంపై ఎర్రవల్లి వెళ్లేందుకు బైక్‌పై బయటికి వచ్చాడు. దీంతో కర్నూల్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన కారు వేగంగా వచ్చి ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వనపర్తి జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్ రెడ్డి పేర్కొన్నారు.

బావిలో పడి మత్స్యకారుడు మృతి



బాలరాజు (ఫైల్)

అమరచింత, అక్టోబరు 2 : ప్రమాదవశాత్తు బావిలో పడి మత్స్యకారుడు డివిటి బాలరాజ్ (39) బుధవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. చేపల వేటకు వెళ్లిన బాలరాజు రెండు రోజులుగా కనిపించకుండా పోయాడు. ప్రమాదవశాత్తు అమరచింత శివారులోని ఓ బావిలో పడిన బాల్‌రాజు శవమై తేలాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాలరాజు భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనాథలైన పిల్లలకు ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మత్స్య కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల, అక్టోబరు 2: అలవాటు పడిన కల్లును తాగనివ్వకపోవడంతో గత నెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన జంగయ్య(56) చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కొండేడు చెందిన జంగయ్య కల్లు తాగేవాడు. ఇటీవల కుటుంబసభ్యులు తాగనివ్వకుండా కట్టడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన జంగయ్య పురుగుల మందు తాగాడు. వెంటనే చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి, అనంతరం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

నారాయణపేట, అక్టోబరు 2 : నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ వద్ద నిలిపిన బైక్‌ను గత నెల 27న చోరీకి గురైందని లక్ష్మీపూర్ చెందిన శంకర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణ పేరిట వాహనం ఉందని ఇంకా తన పేరిట చేసుకోలేదన్నారు. బ్యాంకు వద్ద నిలిపిన అరగంటలోపే వాహనం చోరీకి గురైందని తెలిపారు.

యాపర్లలో క్షుద్రపూజల కలకలం

పెబ్బేరు రూరల్, అక్టోబరు 2 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని యాపర్లలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామ శివారు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి క్షుద్ర పూజలు చేసినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో గుమ్మడికాయ, కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు, కల్లు సీసా, నిమ్మకాయలు, దీపం పెట్టి కోడిని కోసి వదిలేసిన ఆనవాళ్లు కనిపించాయి. బుధవారం ఉదయం గ్రామస్తులు చూశారు. అమావాస్య రోజున క్షుద్ర పూజలు చేయడంతో గ్రామానికి ఏమైనా అరిష్టం జరుగుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా.. మంటలు చెలరేగి వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనాపురం, అక్టోబరు 2 : గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా లీకై అధిక మంటలు రావడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని నర్సింగాపురం చెందిన బాలయ్యగౌడ్ మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గ్యాస్ స్టవ్ ఆన్ చేసి అంటిస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ముఖం పూర్తిగా కాలిపోయింది. అతని కేకలు విన్న చుట్టుపక్కల వారు స్టవ్‌ను బంద్ చేసి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్ ఘటనలో మలుపు

- చిన్నయ్యకు బదులు రాము సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 2 : కానిస్టేబుల్ సస్పెన్షన్ మలుపు తిరిగింది. విచారణలో చిన్నయ్య ప్రమేయం లేదంటూ అసలు సూత్రధారి రాము అని తేలింది. దీంతో చిన్నయ్యను విధుల్లోకి తీసుకుని మరో కానిస్టేబుల్ రాముని సస్పెండ్ చేస్తూ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ కనకయ్య బుధవారం తెలిపారు. గత నెల ఓ జంట ఫొటోలు చిత్రీకరించి డబ్బుల కోసం డిమాండ్ చేయడంతో వారు రూ. రెండు వేలు ఇచ్చి వెళ్లిపోయారు. మూడు నెలల తర్వాత ఆ ఫొటోలను డిలీట్ చేయాలంటే డబ్బులు కావాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ యువకుడి భార్యకు ఫొటోలు చూపించారు. దీంతో వివాహిత ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా, ఆ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధిత కుటుంబీకులకు ఘటన తెలియడంతో ఉదంతం బయటకు పొక్కింది. అప్పట్లో కానిస్టేబుల్ చిన్నయ్యతో పాటు రాంచందర్‌ను ఎస్పీ సస్పెండ్ చేశారు. విచారణ జరిపి చిన్నయ్య ప్రమేయం లేక పోవడంతో విధుల్లోకి తీసుకున్నారు. రామును విధుల నుంచి తొలగించినట్లు సీఐ తెలిపారు.

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

- నూతన విధివిధానాలతో ఈ పాస్‌లో మార్పులు
- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 2: జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆదాయ పరిమితి రూ.2లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచారని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ-పాస్ వెబ్‌సైట్‌లో మార్పు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్య ప్రతినిధులు తమ విద్యార్థులకు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు.

జోగుళాంబ ఆలయంలో చండీ హోమాలు



జోగుళాంబదేవి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

అలంపూర్, అక్టోబరు 2: ఐదవ శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబ దేవి, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం అధికసంఖ్యలో భక్తు లు దర్శించుకున్నారు. అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తుంగభద్ర నదిలో పుణ్యస్నానమాచరించి స్వామివారి ఆలయంలో స్పర్శదర్శనం, అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, త్రిశతి ఖడ్గమాల, చీరలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కు చెల్లించారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



మారమునగాలలో బీఆర్ఎస్ కార్యకర్త భార్యకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవల్లి, అక్టోబరు 2: బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండలంలోని మారమునగాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గొల్ల వెంకట్రాముడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, పార్టీ నుంచి మంజూరైన రూ.రెండు లక్షల బీమా చెక్కును బుధవారం స్థానిక కార్యకర్తలతో కలిసి, కార్యకర్త భార్య లక్ష్మీదేవమ్మకు అందజేశారు. అండగా ఉంటామని చెప్పారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



వడ్డేపల్లి పీహెచ్‌సీ వద్ద స్వచ్ఛత పనిలో సిబ్బంది

వడ్డేపల్లి, అక్టోబరు 2: పరిసరాలు, ఇంటి ఆవరణ పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ ప్రాధాన్యతనివ్వాలని పీహెచ్‌సీ సిబ్బంది సూచించారు. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా, స్వచ్ఛత భారత్ దివస్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది, కార్మికులు పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకులు నర్సింహులు, ఈదన్న, వీరబాబు, పీహెచ్‌సీ సిబ్బంది చంద్రమోహన్, అనిత ఉన్నారు. అలాగే శాంతినగర్ మునిసిపాలిటీ పరిధిలోని వార్డులో ఉన్న గుంతలను పారిశుధ్య కార్మికులు పూడ్చివేశారు. ఎర్రమట్టితో చదును చేసి ప్రయాణికులు, వాహనదారులు ప్రయాణించేందుకు వీలుగా రోడ్డును చదును చేసి రాకపోకలకు సిద్ధంగా చేశారు.

పంట పొలాలకు దారులు వేయాలి



మానవపాడు గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో భాస్కర్

మానవపాడు, అక్టోబరు 2: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో రైతులు మాట్లాడుతూ పంటపొలాలకు వెళ్లే దారులు పూర్తిస్థాయిలో గుంతలమయంగా ఉన్నాయని, గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రోడ్ల పనులు చేయాలని కోరారు. అదేవిధంగా వివిధ కాలనీల్లో డ్రైనేజీలు లేక అవస్థ పడుతున్నామని, జిల్లా పరిషత్ పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని అన్నారు. పాఠశాల సెలవురోజుల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సభలో గ్రామకార్యదర్శి శివశంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, నాయకులు దామోదర్‌రెడ్డి, వెంకట్రాముడు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి



మేడికొండలోని ప్రత్యేక గ్రామసభలో సన్మానం పొందిన సీనియర్ సిటిజన్‌లు

అయిజ, అక్టోబరు 2: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో వెంకటయ్య అన్నారు. బుధవారం మేడికొండలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి దేశవ్యాప్తంగా 750 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశాయని, ఇందులో మేడికొండ గ్రామాన్ని పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసిందని తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 75 సంవత్సరాలు పైబడిన వృద్ధులను సన్మానించారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ పవన్ పాల్గొని ప్రసంగించారు. గ్రామాణాభివృద్ధికి సంబంధించి రక్షిత మంచినీరు. పారిశుధ్యం, అంతర్గత రహదారులు వీధి దీపాలు, ప్రాథమిక విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పశుపోషణ సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, టీఏ అశోక్, ఏపీఎం అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి దివాకర్‌రెడ్డి, ఏఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి

- కలెక్టర్, ఎస్పీ సహా జిల్లా వ్యాప్తంగా ప్రముఖుల ఘన నివాళి
- పలుచోట్ల స్వచ్ఛత కార్యక్రమాలు



కలెక్టరేట్‌లో గాంధీ, లాల్‌బహదుర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు



గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



గద్వాల రాజీవ్‌మార్గ్‌లో శాస్త్రి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 2: దేశ స్వాతంత్ర్యం కోసం శాంతియుతంగా పోరాటం చేసిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. మహాత్మా గాంధీజీ 155వ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖు లు, ప్రైవేట్ కార్యాలయాలు, ఆయా సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పాతబస్టాండ్ వద్ద గాంధీజీ విగ్రహానికి, రాజీవ్ మార్గ్‌లోని లాల్‌బహదుర్‌శాస్త్రి విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ, ఏవో వీరభద్రప్ప, తహసీల్దార్ మల్లికార్జున్, జిల్లా అధికారులు ఉన్నారు. అలాగే హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాళి అర్పించారు.

సమాజ సేవకులకు సన్మానం

జిల్లాలో వివిధ రంగాల్లో సమాజానికి ఉత్తమ సేవలు అందించినందుకు గాను గాంధీజయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బీ.ఎం.సంతోష్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో మున్సిపల్ స్వీపర్ సైదమ్మ, మున్సిపల్ కామాటి హరిప్రసాద్, ఆశవర్కర్ శ్రీదేవి, బాలల రక్షణ భవనం వర్కర్ లక్ష్మీదేవి ఉన్నారు.

ప్రజాప్రతినిధులు..

గద్వాల టౌన్: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద మహాత్ముడి విగ్రహానికి, రాజీవ్‌మార్గ్‌లోని భారత మాజీ ప్రధాని, దివంగత లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి వారి జయంతి సందర్భంగా బుధవారం మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అలాగే మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ వైస్ చైర్మన్ ఎండీ బాబర్, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ ఉన్నారు. వివిధ సంఘాలు, సంస్థల నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

జిల్లా పోలీస్ కార్యాయలంలో..

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాయలంలో మహాత్మా గాంధీ, భారత రెండో ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో గద్వాల ఇన్‌చార్జి సీఐ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు వెంకటేష్, హరీఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అలంపూర్‌లో శ్రమదానం

అలంపూర్ : అలంపూర్ మునిసిపల్ కమిషనర్ సరస్వతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛ పర్యవేక్షణ చేపట్టారు. కౌన్సిలర్లతో కలిసి గాంధీచౌరస్తాలో శ్రమదానం చేశారు. ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గద్వాల గాంధీచౌక్ మహాత్ముడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

అలంపూర్ చౌరస్తాలో..

అలంపూర్ చౌరస్తా: అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కమిటీచైర్మన్ దొడ్డప్ప ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కమిటీ సభ్యులు, సెక్రటరీ ఎల్లస్వామితో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



విద్యుత్ దీపాలంకరణలో జములమ్మ ఆలయం



విద్యుత్ దీపాల వెలుగులో గద్వాల వీరభద్రస్వామి ఆలయం

గద్వాల, అక్టోబరు 2: నడిగడ్డ భక్తుల ఇలవేల్పు జములమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు భారీగాచేశారు. తొమ్మిది రోజులు నిర్వహించే ఈ వేడుకలకు ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. ప్రతి రోజులు విశేష ఫలపంచామృతాభిషేకం, పుష్పాలంకరణ సేవ, మహా మంగళహారతి కుంకుమార్చనలు, ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. మొదటి రోజులు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిస్తారు. 2వ రోజు గజలక్ష్మీదేవి అలంకరణ, 3వ రోజు అన్నపూర్ణదేవిగా, 4వ రోజు శాకాంబరీదేవి అలంకరణలో 5వ రోజు పార్వతీదేవి అలంకరణలో 6వ రోజు ధనలక్ష్మీదేవి అలంకరణలో, 7వ రోజు సరస్వతీ దేవి అలంకరణలో 8వ రోజు దుర్గాదేవి అలంకరణలో 9వ రోజు మహిషాసుర మర్ధినిదేవి అలంకరణలో దసరా రోజు జములమ్మ నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తారని ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు.

గద్వాల పట్టణంలో..

గద్వాల టౌన్ : ఆశ్వయిజ శుద్ధపాడ్యమి నుంచి ప్రారంభమయ్యే దేవీశరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం పట్టణంలోని పలుఆలయాలు ముస్తాబ య్యాయి. ఈనెల 3వ తేదీ నుంచి 12 వరకు తొమ్మిది రోజుల పాటు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అమ్మ వారు కొలువైన ప్రధాన ఆలయాలైన వాసవీ శ్రీకన్యకా పరమేశ్వరి, శ్రీభద్రకాళీ సమేతవీరభద్ర ఆలయం, అంబాభవానీ దేవి ఆలయం, అన్నపూర్ణదేవి ఆలయం, కాళి కాదేవి ఆలయం, భక్తమార్కండేయ స్వామి ఆలయం, తాయమ్మ దేవి ఆలయాలతో పాటు పెద్దఅగ్రహారంలోని అహోబిల మఠం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణాల్లో అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. వీటితో పాటు పలుకులసంఘాల ఆధ్వర్యంలోనూ ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిదిరోజుల పాటు వివిధ రూపాల్లో జగన్మాతను అలంకరించి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

శాంతినగర్ పట్టణంలో..

వడ్డేపల్లి : శాంతినగర్ పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, స్ఫటికలింగేశ్వర, శ్రీశ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 3 నుంచి 13వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు తెలిపారు.

పెద్దదిన్నెలో..

ఇటిక్యాల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వంశపారంపర్య ధర్మకర్త జయసింహ తెలిపారు.

ఘనంగా పాగుంట వెంకన్న కల్యాణం

కేటీదొడ్డి, అక్టోబరు 2: మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పెత్తర్ల అమావాస్య సందర్భంగా అర్చకులు, ఆలయపెద్దలు స్వామి, అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. వేకువజామునే స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పలు రకాల అభిషేకాలు జరిపించి పట్టు వస్త్రాలు ధరించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో భక్తులతో కలిసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చి భక్తుల సమక్షంలో స్వామి, అమ్మవారి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ పెద్దలు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ పెద్దలు శేషిరెడ్డి పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



ఆలయం చుట్టూ రథాన్ని లాగుతున్న భక్తులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజోలి, అక్టోబరు 2: భార్య ఆత్మహత్యను జీర్ణించుకోలేక బలవన్మరణానికి యత్నించిన భర్త చికిత్స పొందుతూ ఘటన మండలంలోని మాన్‌దొడ్డిలో చోటుచేసుకున్నది. రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలు... మండలంలోని మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన తెలుగు వీరేష్ (26) గట్టు మండలం బోయలగూడెం గ్రామానికి చెందిన యువతి భీమక్కతో పదినెలల క్రితం వివాహమైంది. సెప్టెంబరు 6న దంపతులు బోయలగూడెంలోని అత్తగారి ఇంటికి వెళ్లగా, అక్కడ కుటుంబ సభ్యులు గొడవ పడడంతో భీమక్క మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త తెలుగు వీరేష్ సెప్టెంబరు 25న మాన్‌దొడ్డి గ్రామంలో ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు తూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి తెలుగు భీమమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

కార్మికులకు ఇన్సూరెన్స్ అమలు చేయాలి

ధరూరు, అక్టోబరు 2: గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.5లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరూరులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో చంద్రాములు, రంగన్న, నాగన్న, సవారన్న, హనుమంతు, శంకరన్న, ప్రకాశం ఉన్నారు.

డస్ట్‌బిన్‌లు పంపిణీ

గట్టు, అక్టోబరు 2: మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో బుధవారం ఎంపీడీవో చెన్నయ్య గ్రామస్థులకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశామని తెలిపారు.

ప్రారంభమైన ధ్రువపత్రాల పరిశీలన



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

గద్వాలటౌన్, అక్టోబరు 2: డీఎస్సీ- 2024 ఎస్‌జీటీ ఉపాధ్యాయ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమైంది. డీఎస్సీ-2024కు సంబంధించి ఖాళీల నియామకానికి సంబంధించి 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల్లో జిల్లాస్థాయిలో తొలి ర్యాంకు సాధించిన గద్వాల మండలానికి చెందిన అభ్యర్థి శృతి ధ్రువపత్రాలను పర్యవేక్షక అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ రామకృష్ణ, అధికారి విజయలక్ష్మి, ఎంఈవోలు సురేష్, వెంకటేశ్వరరావు, రవీంద్రబాబు, డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి, జీహెచ్‌ఎంలు నరేష్, అమరేందర్ రెడ్డి, పాగుంటన్న, భాస్కర్, కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణారెడ్డి ఉన్నారు.

ఓపన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- పరిశీలించిన ఏసీజీఈ శ్రీనివాస్

గద్వాల టౌన్, అక్టోబరు 2 : జిల్లా కేంద్రం గద్వాల పట్టణంలోని రెండు కేంద్రాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి 9 వరకు ఓపన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం రెండు కేంద్రాల్లో ఏర్పాట్లను ఏసీజీఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారి పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్, ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ అభ్యర్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. ప్రతి కేంద్రానికి ఒక సెంట్రల్ సూపరింటెండెంట్, మరొక డిపార్ట్‌మెంటల్ అధికారి ఉంటారన్నారు. అభ్యర్థులతో పాటు పరీక్షల విధులకు హాజరయ్యే అధికారులు ఎవ్వరూ పరీక్ష సమయంలో సెల్ ఫోన్లు వినియోగించరాదని ఆదేశించారు. విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రానికి నిర్దేశించిన సమయానికన్నా గంట ముందుగానే చేరుకోవాలన్నారు. పరీక్షలు పకడ్బందీగా, సాఫీగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తుతో పాటు అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం



ఆలయ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

వడ్డేపల్లి, అక్టోబరు 2: ఇటీవల ఎన్నికైన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మండలంలోని కొంకల గ్రామంలో బుధవారం నాగేశ్వర్‌రెడ్డి నివాసంలో చైర్మన్‌ను శాలువా, పూలమాలతో సత్కరించి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలంపూర్ ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంగారు మహేశ్వర్‌రెడ్డి, యోగిరెడ్డి వెంకట్రాములు, జగదీశ్వర్‌రెడ్డి, వేణురెడ్డి ఉన్నారు.

లక్ష్యసాధన కోసం నిరంతర పోరు

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న

గద్వాల టౌన్, అక్టోబరు 2: సామాజిక వివక్షను రూపుమాపడమే లక్ష్యంగా ఏర్పాటైన కులవివక్ష పోరాటం సంఘం లక్ష్యసాధన కోసం నిరంతర పోరాటం సాగిస్తుందని జిల్లా అధ్యక్షుడు మారెన్న అన్నారు. సంఘం 26వ ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని కార్యాలయం వద్ద కేవీపీఎస్ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా మారెన్న మాట్లాడుతూ జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, భూ సంబంధ సమస్యలు, వివక్ష తదితర అంశాలపై గడచిన 26ఏళ్లుగా అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కర్రెప్ప, బద్రి, భీమన్న, హనుమంతు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో భక్తుల సందడి

మల్దకల్, అక్టోబరు 2: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అధికారులు ఏర్పాట్లుచేశారు. అమావాస్య సందర్భంగా కాకతీయ టెక్నోస్కూల్ యాజమాన్యం అన్నదాన ఏర్పాటు చేయగా, రాత్రి బసచేసే భక్తులకు శివశివాని స్కూల్ యాజమాన్యం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

ఇటిక్యాల, అక్టోబరు 2: మహాలయ అమావాస్యను పురస్కరించుకొని మండలంలో బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పెద్దదిన్నెలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఇటిక్యాల శివాలయం దగ్గర గ్రామస్థులు భక్తులకు అన్నదానం చేశారు.

మానవపాడులో..

మానవపాడు: మండల కేంద్రంలోని అడవి ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య పూజలు చేశారు. అమరవాయిలోని ఆంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చణ, ఆకుపూజ చేసి భక్తులు మొక్కులు చెల్లించారు.

రాజోలి మండలంలో..

రాజోలి : రాజోలిలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలుచేశారు. ఆల య కమిటీ వారి ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి బిందెసేవ, ప్రత్యేక అభిషేకాలు చేసి, స్వామి వారిని సింధూరంతో అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇటిక్యాల, అక్టోబరు 2: మండలంలోని కోదండాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శేషన్న కుమారుడుఅడవి రాముడు మృతి చెందగా బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు వెంకటేష్, రుక్మానందరెడ్డి, బజారన్న, పుల్లారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఆర్థిక శాఖ జాయింట్ కమిషనర్

అలంపూరు, అక్టోబరు 2: తెలంగాణ ఆర్థికశాఖ జాయింట్ కమిషనర్ హరిత బుధవారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో పురేందర్ కుమార్, అర్చకులు వీరికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో అభిషేకాలు, అమ్మవారికి అర్చన వంటి విశేష పూజలను చేయించారు.